క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన సబ్‌కలెక్టర్



కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్కను అందిస్తున్న సబ్‌కలెక్టర్ వినూత్న

ఏలూరు(మెట్రో): నూజివీడు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బొల్లిపల్లి వినూత్న సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నూజివీడు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నిలిపేలా పనిచేయాలని సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డిని, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

తాటాకు అల్లికలు, బొమ్మలు భళా

ఏలూరు(మెట్రో): డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఈనెల 18 నుంచి తాటాకులతో హస్తకళా నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కొందరు మహిళలు తాటాకుతో తయారుచేసిన పలు హస్తకళ ఉత్పత్తులను కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని స్వయం సహాయక సంఘ మహిళలకు జీవనోపాధి మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా తాటాకులతో అల్లికల ద్వారా పూల బుట్టలు, టోపీలు, దండలు, పూల బొకేలు, ఇతర బొమ్మలు తయారు చేసే హస్త కళాకారులకు చింతలపూడిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వారు తయారు చేసిన వస్తువులకు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్, ఆ వస్తువులను డీఆర్‌డీఏ ద్వారా నిర్వహించే ఎగ్జిబిషన్స్‌కి పంపించి మరింత ఆదరణ, గిరాకీ కలిగేలా చేస్తామని చెప్పారు. అవసరమైన బ్యాంకు, ఇతర ఋణ సదుపాయం కల్పించటం తదితర అంశాలపై సోమవారం తమను కలిసిన డ్వాక్రా మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని జాలిపూడి రోడ్డు వెడల్పు నిమిత్తం వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. మాదేపల్లి రోడ్డు, శుక్రవారి తోట, ప్రేమాలయం ప్రాంతం, గాయత్రి నగర్, వెంకటాపురం ఎంపీ రోడ్డు, లింగారావు గూడెం, కాట్లంపాడు, శ్రీపర్రు, మానూరు, ఎంహెచ్‌పురం, కలకుర్రు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

సేవలు అధ్వానం.. రోగుల్లో అయోమయం

- ఏలూరు జీజీహెచ్‌లో గాడితప్పిన వైద్యం
- గర్భిణులు, మహిళలకు స్కానింగ్ కష్టాలు
- గుండె వ్యాధుల నిర్ధారణ ఒక్కరోజే
- ఎంఆర్‌ఐ స్కానింగ్‌కు రోగులకు తప్పని తిప్పలు



ఈసీజీ తీయించుకునేందుకు రోగుల పడిగాపులు



జనరల్ ఓపీ వద్ద వైద్యం కోసం రోగుల అవస్థలు

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల కష్టాలు వర్ణణాతీతం. ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధనాసుపత్రి (సర్వజన ఆసుపత్రి)ని గతంలో అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా, ఏలూరు జీజీహెచ్‌లో ప్రజలకు సరైన వైద్యసేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సైతం సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినా, వైద్యులు, సిబ్బందిలో మాత్రం కనీసం మార్పు కనిపించకపోవటం గమనార్హం. మరోవైపు ప్రజా ప్రతినిధులు సైతం రోగులకు మెరుగైన చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవటంలో విఫలం అవుతున్నారు.

టెక్నీషియన్ లేక స్కానింగ్‌కు ఇబ్బందులు

ఏలూరు జీజీహెచ్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) బ్లాక్‌లో ప్రతి రోజూ సుమారుగా 200 నుంచి 300 మంది వరకు వివిధ ఆరోగ్య సమస్యలపై వస్తుంటారు. గైనిక్ వైద్యులు మహిళలకు పరీక్షలు చేయటం, మందులు ఇవ్వటం, స్కానింగ్‌లు రాస్తుంటారు. కానీ ఇక్కడ స్కానింగ్ చేసేందుకు టెక్నీషియన్ లేకపోవటంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసం టెక్నీషియన్‌ను సైతం నియమించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని రోగులు వాపోతున్నారు. ఒక్కోసారి మెడికల్ పీజీ విద్యార్థినులతో కొంత సేపు స్కానింగ్ చేయిస్తుండగా, ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే పేదలకు వైద్యసేవలు అందే అవకాశం లేదని చెబుతున్నారు. ప్రతి రోజూ స్కానింగ్ చేస్తారనే ఆశతో గర్భిణులు, కడుపునొప్పి, ఇతర రోగులు స్కానింగ్ కేంద్రానికి ఉదయం 10 గంటలకు చేరుకున్నా, ఎప్పటికి స్కానింగ్ చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.



బంధువును స్ట్రెచర్‌పై ఎక్స్‌రే వార్డుకు తీసుకువెళ్తున్న యువకుడు



తల్లిని వీల్‌చైర్‌లో వైద్యానికి తీసుకువెళ్తున్న కుమారుడు



వైద్యం కోసం వృద్ధుడి ఎదురుచూపులు

పలు విభాగాలు ప్రైవేటు పరం

ఏలూరు సర్వజన ఆసుపత్రిని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఒక్కో విభాగాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టింది. జీజీహెచ్‌లో గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేకంగా వైద్య నిపుణులను నియమించాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పైగా గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఈ ఏజెన్సీ కేవలం సోమవారం ఒక్కరోజు మాత్రమే ఏలూరు జీజీహెచ్‌కు వచ్చి పరీక్షలు చేసి, రోగులను తమకు నచ్చిన, ఫీజుల్లో వాటాలు ఇచ్చే కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కరోజు మాత్రమే గుండె వ్యాధి నిర్ధారణ చేస్తే, మిగిలిన ఆరు రోజులు అత్యవసర స్థితిలో పేదల గుండెలకు భరోసా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంఆర్ఐ స్కానింగ్ కష్టాలు

తీవ్ర అనారోగ్యమో, అత్యవసర పరిస్థితో వస్తే వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్‌కు రాస్తే రోగుల పాట్లు చెప్పనలవి కావు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి ఒక రోగిని అత్యవసర వైద్యం కోసం ఏలూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. స్కానింగ్ కోసం వెళితే తాళాలు వేసి ఉండడంతో రోగి తాలూకు బంధువులకు ఏం చేయాలో అర్థం కాలేదు. వైద్యులు ఫోన్ చేసినా స్కానింగ్ సిబ్బంది స్పందిచలేదని వాపోయారు. సాయంత్రం 4.30 గంటలకు తాపీగా వచ్చిన సిబ్బంది స్కానింగ్ చేశారని రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీజీహెచ్‌లో స్కానింగ్‌కు వెళితే, వారం నుంచి నెల రోజుల వరకు పడుతుందని, సిబ్బంది చెప్పిన తేదీకి వస్తేనే స్కానింగ్ చేస్తారని చెబుతున్నారు.

ప్రోత్సాహకాలు, అవార్డుల ప్రదానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారస్తుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పారితోషికాలను అందజేశారు. వివిధ రంగాలలో ప్రతిభావంతులు వైద్యరంగంలో కర్రి సత్యనారాయణకు వైద్య రత్న పురస్కారం, కేకేఎస్ జ్యూయలరి సంస్థల అధినేత కాద రామకృష్ణ ప్రసాద్ (రాంబాబు)కు వాణిజ్య రత్న పురస్కారం, అద్దంకి సత్యనారాయణకు దారు శిల్పిపురస్కారం, సీనియర్ స్వర్ణకారుడు పాడుగు సత్యనారాయణ మూర్తికి స్వర్ణ శిల్పి పురస్కారాన్ని అందజేశారు. తొలుత వింజవరపు సాయి నవ్యశ్రీ శిష్య బృందం స్వాగత నృత్యంతో అతిథులు స్వాగతం పలుకగా, గొల్లపల్లి కామేశ్వరరావు సిద్ధాంతి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. ముఖ్య అతిథిగా వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం ముని మనుమడు నొస్సం వీరంభట్లయ్య స్వామి హాజరై బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు వివరించారు. కార్యక్రమంలో ఈశ్వరీ దేవి మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు జవ్వాది కూర్మాచార్యులు, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలను అందిస్తున్న అతిథులు

దేశభక్తి పెంపే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు ప్రతి ఏటా తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి చైతన్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాట్రు విజయ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అదపాక నాగ సురేష్ పేర్కొన్నారు. సోమవారం వెస్ట్ మండల అధ్యక్షుడు అజ్జాడ అప్పారావు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. నాయకులు గుమ్మడి చైతన్య, కాట్రు విజయ్, అదపాక నాగ సురేష్ పాల్గొన్నారని పేర్కొన్నారు.

● ఇంద్ర ధనుస్సు.. కనువిందు



ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని కొద్దిసేపటికే పెద్ద పెద్ద చినుకులతో ఒక్కసారిగా వర్షం ప్రారంభమైంది. ఇంతలోనే మరోసారి ఎండ కనిపించింది. ఎండావానతోపాటు ఆకాశంలో ఇంద్ర ధనస్సు ప్రత్యక్షమైన దృశ్యమిది. ఇది నగర ప్రజలకు కనువిందు చేసింది.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

సబ్సిడీ, అదనపు యూనిట్లు కేటాయించాలి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో ఎస్సీ సామాజిక వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీల్లోని బీపీఎల్‌లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా ఇస్తుందని, సోలార్ యూనిట్‌ను గృహాలపై ఏర్పాటు చేసుకున్నా అదే 200 యూనిట్లు ఇస్తారంటున్నారే తప్ప అదనంగా ఒక్క యూనిట్ కూడా ఇవ్వడం లేదని వివరించారు. దీంతో ఎస్సీలకు అదనంగా ఈ పథకం వల్ల ఒనగూరే ప్రయోజనం లేదని తెలిపారు. ఈ పథకంలో ఎస్సీలకు రూ.50 వేలు సబ్సిడీ ఇచ్చి అదనంగా 200 యూనిట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, వివిధ సంఘాల నాయకులు ఎస్‌ఏడీ పాల్, నూకపెయ్యి కార్తీక్, తెనాలి సురేష్, కనికెళ్ల మురళి, కనికెళ్ల రవిప్రసాద్ ఉన్నారు.

ఎస్సీల ఐక్యతతోనే రాజ్యాధికారం

ఏలూరు (టూటౌన్): ఎస్సీలు ఐక్యతోనే రాజ్యాధికారం సాధించగలుగుతారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 1997లో వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన చలో సచివాలయం కార్యక్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ నాటి ఉమ్మడి ఏపీలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నిరంకుశంగా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ మాలలను తీవ్రంగా అణచివేశారని ఆరోపించారు. దీంతో చంద్రబాబు రాజకీయ పతనం చవిచూశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని 2004లో కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినప్పటికీ ఇంకా ఇందే అంశాన్ని చేత పట్టుకొని అదేదో అభివృద్ధి పథకమని చెప్పడం దేశంలోని అగ్ర వర్ణాల వారి స్వార్థానికి పరాకాష్ట అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు సైనికుల్లా తయారవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మృత వీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లెం ప్రసాద్, డాక్టర్ ఎస్‌ఏడీ పాల్, నూకపెయ్యి కార్తీక్, తెనాలి సురేష్, గారపాటి నాగేశ్వరరావు, కనికెళ్ల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వినతుల స్వీకరణ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ విజయ్ కుమార్‌రాజు

దెందులూరు: ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎఫ్‌లైన్ సర్వే, మ్యూటేషన్ కోసం రెండు వినతులు ఇచ్చారని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు తెలిపారు. వినతులను ఆన్‌లైన్ చేసి పరిష్కారం నిమిత్తం సంబంధిత వీఆర్‌ఓలకు పంపామన్నారు. అనంతరం ఆయన సర్వేయర్లు, ఆర్ఐ, వీఆర్‌ఓలతో సమీక్షించారు. ఆర్ఐ అజయ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	బీర్లచిక్కుడు	112
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	20	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	26	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	68-86
క్యారెట్	46	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	31


నులిపురుగుల నివారణపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న ఎంపీహెచ్‌ఈఓ ఉమా మహేశ్వర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నులి పురుగుల నివారణకు 1 నుంచి 19 సంవత్సరాల్లోపు విద్యార్థులంతా మందులు వాడాలని ఎంపీహెచ్‌ఈఓ ఉమా మహేశ్వర రావు సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జాలిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ప్రతి సంవత్సరం రెండుసార్లు ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాములు మాత్ర ఇస్తున్నట్టు చెప్పారు. ఈనెల 12న ఉచితంగా జాలిపూడిలోని అన్ని పాఠశాలల్లో మాత్రలు ఇచ్చే ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.సంధ్య, హెచ్‌ఎం జి.మోహన్ మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఏదైనా తిన్న తర్వాత, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నులిపురుగుల నుంచి రక్షణ అనే పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం యు.నిర్మల, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిలో మామిడి సాగు



దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో మామిడి సాగును సోమవారం ఏపీఓ ఫాతిమా ప్రసన్న, టీఏ దీప్తి పరిశీలించారు. ఎకరాకు 70 మామిడి మొక్కలు సాగుకుగాను మూడు సంవత్సరాలకు రూ.1,09,950 నిర్వహణ ఖర్చుల నిమిత్తం రైతు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారన్నారు. మెట్ట గ్రామంలో మామిడి సాగు ఆశాజనకంగా ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారన్నారు. వారి వెంట పెరుగ్గూడెంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ గొన్నూరి శివ ఉన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

పెదవేగి: మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పెదవేగి మండలం లక్ష్మీపురం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం మోదీకి ఎవరిచ్చారని ఆటో, హమాలి తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రమేష్, పి.ప్రసాద్, బి.రోజా, రాజ్యలక్ష్మి, గంగాధర్, సుబ్బారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పై దేవాలయానికి ధర్మకర్తగా నియామకం పొందుటకు 20 రోజుల్లో దేవాదాయ ధర్మాదాయశాఖ నమూనా ఫారం-2 దరఖాస్తును జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, ఏలూరు వారికి పంపించాలని తెలిపారు. వివరాలకు ఆఫీసు పని వేళల్లో సంప్రదించాలని ఈఓ కోరారు.

కొత్త విధానంతో విద్యార్థులకు అదనపు భారం

భీమడోలు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం సెల్ఫ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ-1) పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, లెక్కల పరీక్షలు రాశారు. కూటమి సర్కార్ అసెస్‌మెంట్ బుక్ లెట్‌ను అందించింది. దీంతో విద్యార్థి అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లో ప్రశ్నలకు సమాధానాలు రాయడంతో పాటు ప్రశ్నాపత్రంలోనూ వాటి ఆన్సర్లను రాయాల్సి వస్తుంది. అంటే రెండు సార్లు ప్రశ్నలకు ఆన్సర్లు రాయాలి. దీంతో విద్యార్థులపై అదనపు భారం పడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటిని సక్రమంగా రాస్తున్నదీ లేనిదీ విద్యాశాఖాధికారులు పరిశీలించారు. గుండుగొలను మోడల్ ప్రైమరీ పాఠశాల నంబర్-1లో జరుగుతున్న పరీక్షలను భీమడోలు ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పరిశీలించారు. సుమారు 120 మంది విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని, నిర్వహణ విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాశం పాండురంగారావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.